## పోలీసుల కవాతు..


బాబాపూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 5 : మండలంలోని రవీంద్రనగర్-1,2 బాబాపూర్ గ్రామాల్లో సీఐ సాధిక్ పాషా ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, టీఎస్ఎస్‌పీ సిబ్బందితో ప్రధాన రహదారి గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భయాభ్రాంతులకు గురికాకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రవీంద్రనగర్-1 మార్కెట్ ఏరియాలో వాహనాల తనిఖీ చేశారు. వాహనదారులకు రోడ్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు. ఎస్ఐ నరేశ్, ఏఎస్ఐ యాదవ్, 40 మంది టీఎస్ఎస్‌పీ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | మంచిర్యాల, శనివారం 6 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## నేడు రైతులకు మద్దతుగా నిరసన దీక్షలు

చెన్నూర్/బెల్లంపల్లి, ఏప్రిల్ 5 : రైతు బాంధవుడు, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు రైతన్నలకు మద్దతుగా చెన్నూర్‌లోని పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద శనివారం నిరసన దీక్ష చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ యాసంగి సీజన్ నుంచే ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్ ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతు లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**విజయవంతం చేయాలి**

బెల్లంపల్లి, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం బెల్లంపల్లిలోని ఏఎంసీ ఏరియాలోని ఏ-3 క్వార్టర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం చిన్నయ్య తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# ప్రభుత్వ ఆఫీసుల పన్నులేవీ ?

**బల్దియాలకు ప్రభుత్వ కార్యాలయాలు కట్టాల్సిన బకాయిలు రూ.10.4 కోట్లు**

- **మార్చి 31 నాటికి రూ.16.17 కోట్లలో వసూలైనవి రూ.5.77 కోట్లే**
- **నస్పూర్ మున్సిపాలిటీకి రూ.1.10 కోట్లు కట్టాల్సిన సింగరేణి**
- **ఆదిలాబాద్‌లో రూ.4.11 కోట్లు బకాయిపడ్డ ప్రభుత్వాఫీసులు**
- **నిర్మల్‌లో రూ.2.50 కోట్లు, మంచిర్యాలలో రూ.1.70 కోట్లు..**

మంచిర్యాల, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేసే అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి బల్దియాలకు వచ్చే ఆస్తి పన్ను బకాయిలపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏండ్లకేండ్లు కోట్లలో పేరుకుపోతున్నా, సేకరించడంలో విఫలమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత నెలలో వసూలు చేసిన ఆస్తిపన్నుతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీలకు ఆదాయం పెరిగింది. జిల్లాలోని 12 మున్సిపాలిటీలకు రూ.58.90 కోట్లు పన్నుల రూపంలో సమకూరాయి. సాధారణంగా పురపాలికలకు నల్లా పన్ను, దుకాణాల అద్దె, వర్తక పన్ను, వాణిజ్య ప్రకటనలపై వచ్చే ఆదాయం కన్నా.. ఆస్తిపన్ను రూపంలో వచ్చే ఆదాయమే ఎక్కువ. అందుకే సకాలంలో పన్ను కట్టకపోతే ఎక్కడ మెలిక పెట్టాలో అక్కడ పెట్టి మరీ వసూలు చేస్తారు. ఎందుకంటే మున్సిపాలిటీల ఖర్చులు దీనిపైనే ఆధారపడి ఉంటాయి. ఒక్క ఏడాది పన్ను వసూలు కాకుండా బకాయిలు పేరుకపోయాయా.. ఇక అంతే సంగతులు. అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో పాటు బిల్లుల చెల్లింపులు, సిబ్బంది, కార్మికుల వేతనాలు కష్టమైపోతాయి. అందుకే మొండి బకాయిల విషయంలో అధికారులు, సిబ్బంది కఠినంగా వ్యవహరిస్తుంటారు. ఇటీవల నిర్మల్ జిల్లాలో పన్ను బకాయిలున్న ఇండ్ల గేట్లను మున్సిపాలిటీ వాళ్లు తీసుకెళ్లిపోయారు. ఖాళీ స్థలాలు ఉండి మొండి బకాయిలుంటే స్థలం అమ్ముకునేప్పుడో, ఇంటి నిర్మాణ సమయంలోనే పర్మిషన్‌కు ఆస్తి పన్నుకు మెలికపెట్టి మరీ వసూలు చేస్తుంటారు. అందుకే ఉమ్మడి జిల్లాలో రూ.100.29 కోట్ల లక్ష్యంలో దాదాపు 60శాతం వసూళ్లు చేయగలిగారు. ఇక్కడికి వరకు బాగానే ఉన్నా ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన పన్నులు మాత్రం మున్సిపాలిటీలకు రాకపోవడం గమనార్హం.

### ప్రభుత్వ బకాయిలు రూ.10.4 కోట్లు

సాధారణ జనాలు పన్నులు కట్టని పక్షంలో కఠినంగా వ్యవహరించే అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సరికి మాత్రం ఏం చేయలేకపోతున్నారు. ఏండ్లకేండ్లు ఆస్తి పన్ను బకాయిలుంటున్నా, వసూలు చేయడంలో విఫలమవుతున్నారు. ఉమ్మడి జిల్లాకు ఉన్న రూ.100.29 కోట్ల లక్ష్యంలో వసూలైన మొత్తం తీసేస్తే ఇంకా రూ.41.39 కోట్లు కట్టాల్సి ఉంది. ఈ బకాయిల్లో 40 శాతం అంటే రూ.16.17 కోట్లు ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సి ఉండగా, రూ.5.77 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ. 10 కోట్లపైచిలుకు పన్నులు వసూలు కాలేదు. ఇవన్నీ ఈ ఒక్క ఆర్థిక సంవత్సరానికి కాదు.. ఏండ్లకు ఏండ్లుగా కట్టకుండా పేరుకుపోయిన బకాయిలే. సింగరేణి సంస్థ రూ.1.10 కోట్లు నస్పూర్ మున్సిపాలిటీకి బకాయిపడింది. అత్యధికంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 756 ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.8.49 కోట్ల పన్నులు రావాల్సి ఉండగా, ఈ ఏడాది రూ.4.38 కోట్లు వసూలయ్యాయి. నిర్మల్ మున్సిపాలిటీకి ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.3 కోట్లు రావాల్సి ఉండగా, రూ. 50 లక్షలు, మంచిర్యాల మున్సిపాలిటీకి రూ.1.83 కోట్లకు రూ.12.37 లక్షలు మాత్రమే వచ్చాయి. ఇలా ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 మున్సిపాలిటీల్లో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.5.77 కోట్ల పన్నులు మాత్రమే వసూలు అయ్యాయి. ఒక్క క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఎలాంటి బకాయిలు లేవు.

### టాప్‌లో లక్షెట్టిపేట మున్సిపాలిటీ..

పన్నుల వసూళ్లలో తెలంగాణ రాష్ట్ర సగటు 70.34శాతంగా ఉండగా, ఉమ్మడి జిల్లాలో ఈ మార్కును కేవలం రెండు మున్సిపాలిటీలు మాత్రమే దాటగలిగాయి. లక్షెట్టిపేట మున్సిపాలిటీ రికార్డు స్థాయిలో 91.44 శాతం పన్నులు వసూలు చేసింది. రాష్ట్రంలోనే ఈ మున్సిపాలిటీ టాప్-8లో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో లక్షెట్టిపేట మొదటిస్థానంలో ఉండగా, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ 80.17శాతంతో రెండో స్థానంలో ఉంది. మన జిల్లాలోని భైంసా 47.29 శాతంతో రాష్ట్రంలోనే అట్టడుగున ఉంది. మంచిర్యాల 68.45 శాతం, ఆదిలాబాద్ 64.23 శాతం, కాగజ్‌నగర్ 58.16, నస్పూర్ 56.52, చెన్నూర్ 55.94, నిర్మల్ 53.24, మందమర్రి 53.20, బెల్లంపల్లి 50.79 మాత్రమే 50 శాతం మార్కును దాటి ఆస్తిపన్నులు వసూలు చేయగా, ఖానాపూర్ మున్సిపాలిటీ 49.06శాతం పన్నులు వసూలు చేసింది.


నిర్మల్‌లో ఆస్తిపన్ను కట్టకపోవడంతో ఇంటి గేట్లు తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

నోట్: ఈ టేబుల్ రూపాయలు కోట్లలో ఇచ్చాం. లక్షల్లో ఉన్న దగ్గర పూర్తిగా మెన్షన్ చేశాం.
మున్సిపాలిటీ వారీగా వసూలైన పన్ను, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన పన్ను వివరాలు ఇలా..

| మున్సిపాలిటీ | ఇప్పటి వరకు వసూలైన పన్ను | ఇంకా వసూలు కావాల్సినవి | ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సినవి | ఇప్పటి వరకు వసూలైనవి |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 8.42 | 3.04 | 8.49 | 4.38 |
| నిర్మల్ | 6.18 | 4.75 | 3.00 | 50,00,000 |
| మంచిర్యాల | 12.04 | 7.21 | 1.83 | 12,37,000 |
| నస్పూర్ | 2.88 | 2.10 | 1.10 | 00 |
| భైంసా | 2.91 | 2.99 | 60,51,000 | 00 |
| చెన్నూర్ | 14.44 | 10.68 | 36,20,000 | 00 |
| ఖానాపూర్ | 92,00,000 | 27,00,000 | 23,26,000 | 10,33,000 |
| బెల్లంపల్లి | 2.41 | 1.04 | 22,00,000 | 16,00,000 |
| కాగజ్‌నగర్ | 2.33 | 1.58 | 20,00,000 | 4,30,000 |
| మందమర్రి | 1.60 | 53,56,000 | 10,18,000 | 5,06,000 |
| లక్షెట్టిపేట | 1.40 | 7,58,000 | 3,71,000 | 88,568 |
| క్యాతన్‌పల్లి | 3.37 | 7.12 | 25,000 | 25,000 |
| మొత్తం | 58.90 | 41.39 | 16.17 | 5.77 |

### వడ్డీ మీద 90 శాతం రాయితీ కలిసివచ్చింది



*ఆస్తి పన్ను వసూలు కోసం మార్చి 31వ తేదీ డెడ్‌లైన్ పెట్టుకొని పనిచేశాం. విస్తృత ప్రచారం నిర్వహించడం, బకాయిలు తగ్గించేందుకు వడ్డీ మీద 90శాతం రాయితీ ఇవ్వడం కలిసి వచ్చింది. చాలా మంది ఈ సదుపాయాన్ని ఉపయోగించుకున్నారు. మంచిర్యాలలో 68.45 శాతం పన్నులు వసూలయ్యాయి. ఇంకా కట్టనివాళ్లు ఎవరైనా ఉంటే వెంటనే కట్టాలి. మొండి బకాయిలు ఎప్పటికైనా ప్రమాదకరమే. బకాయిల వసూళ్లపై దృష్టి సారించాం. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు మొండి బకాయిల విషయంలో తగిన చర్యలు తీసుకుంటాం. ఎర్లీబర్డ్ స్కీమ్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అడ్వాన్స్‌గా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని, ముందస్తు పన్నులను 5 శాతం రాయితీతో చెల్లించాలి.*

**- ఏ. మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల**


సభ్యత్వం అందజేస్తున్న టీబీజీకేఎస్ నేత మిర్యాల రాజిరెడ్డి

## టీబీజీకేఎస్ బలోపేతానికి కృషి

- **యూనియన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి**
- **సభ్యత్వ నమోదు ప్రారంభం**

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 5 : సింగరేణి లో అనేక హక్కులు సాధించిన టీబీజీకేఎస్ బలోపేతానికి కృషి చేస్తామని ఆ యూనియన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం నస్పూర్‌కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పలువు రు కార్మికులకు ఆయన యూనియన్ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భం గా రాజిరెడ్డి మాట్లాడుతూ టీబీజీకేఎస్ యూనియన్ కోలిండియాలోని అనేక హక్కులను సింగరేణి కార్మికులకు సాధించిపెట్టిందన్నారు. తమ హయాంలో కార్మికుల సంక్షేమాభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. సింగరేణిలో దాదాపు 20 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. ఈనెల 24న గోదావరిఖనిలో జనరల్‌బాడీ సమావేశం నిర్వహిస్తున్నామని, అనంతరం కేంద్ర కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కేంద్ర కమిటీ తర్వాత, ఏరియా కమిటీలు, పిట్ కమిటీలను నియమిస్తామని తెలిపారు. యూనియన్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమా న్ని పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాసు రాంమూర్తి, పెట్టం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, రత్నాకర్‌రెడ్డి, తొంగల రమేశ్, పొగాకు రమేశ్, గొర్ల సంతోష్, బానోత్ రాజూనాయక్, సాధుల భాస్కర్, ఎండీ లాలా, కుర్మ వికాస్, ఉత్తేజ్ రెడ్డి, మాధవరెడ్డి, మారం శ్రీను పాల్గొన్నారు.

## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- **ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి**
- **ఎస్పీ సురేశ్ కుమార్**

కెరమెరి, ఏప్రిల్ 5 : ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో కేసులకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళి రాజకీయ పార్టీలు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అమలు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, సమస్యలను పరిష్కరిస్తూ, మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. సిబ్బందికి ప్రతి గ్రామం గురించి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మమేకమై, ప్రజలకు మరింత చేరువకావాలని తెలిపారు. ఉత్తమ పనితీరు చూపిన వారికి ప్రతిఫలం దక్కుతుందని తెలియజేశారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడాలని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గుంపుల విజయ్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్ కుమార్

## బెయిల్‌పై వచ్చిన రోజే మళ్లీ దొంగతనం

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 5 : బెయిల్‌పై వచ్చిన రోజే మళ్లీ దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని అశోకరోడ్‌కు చెందిన అనుముల శ్రీధర్, సప్తగిరి కాలనీకి చెందిన వెంగల శ్యాంకుమార్ మార్చి 16న పట్టణంలో నాలుగు ఆటోలను దొంగతనం చేసి పట్టుబడి జైలుకెళ్లారు. ఈ నెల 4న బెయిల్‌పై బయటకు రాగా, చేతిలో డబ్బులు లేకపోవడంతో అదే రోజు శ్రీనివాస్ థియేటర్ సమీపంలోని అపార్ట్‌మెంట్ వద్ద పార్క్ చేసిన ఆటోను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఆటోను కరీంనగర్‌లో అమ్మేందుకు తీసుకెళ్తుండగా, ఓవర్‌బ్రిడ్జిపై వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితులను అరెస్ట్‌చేసి, రిమాండ్‌కు తరలించినట్లు, వరుస దొంగతనాలకు పాల్పడుతున్నందున పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# జగ్జీవన్‌రామ్‌కి ఘన నివాళి


జగ్జీవన్‌రామ్‌చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**కలెక్టరేట్‌లలో ఘనంగా జయంతి**

ఆసిఫాబాద్ టౌన్/నస్పూర్, ఏప్రిల్ 5 : ఆసిఫాబాద్, నస్పూర్ కలెక్టరేట్‌లలో శుక్రవారం బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్లు వెంకటేశ్ దోత్రే, బదావత్ సంతోష్ అధికారులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఆపై ఆయన సేవలను కొనియాడారు. ఎస్పీ సురేశ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, డీఎస్పీ సదయ్య, ఉద్యోగులు, కుల సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నెన్నెల, ఏప్రిల్5 : నెన్నెలలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2005-2006 పదో తరగతి బ్యాచ్ విద్యార్థు లు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులంతా ఒకచోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. దాదాపు 85 మంది విద్యనభ్యసించగా, 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, ప్రమీల, రాంమూర్తి, గోపాలకృష్ణ, శంకరయ్య, హెచ్ఎం ప్రకాశ్‌రావు సన్మానించారు.


నెన్నెల జడ్పీఎస్ పాఠశాలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

# గుక్కెడు నీళ్లకు గుట్ట దిగాల్సిందే

**— పూనగూడ గ్రామస్తుల 'పానీ'పాట్లు**

- **బండరాళ్లు, నడవలేని దారిలో గిరిజనుల నరకయాతన**
- **నెత్తిన నీళ్ల బిందెతో మళ్లీ గుట్ట ఎక్కాల్సిందే..**
- **నాలుగు నెలల క్రితం వరకు మిషన్ భగీరథ నీళ్లు**
- **కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మళ్లీ క'న్నీటి'గోస**


గుట్టలు ఎక్కుతూ దిగుతూ నీళ్లు తెచ్చుకుంటున్న గిరిజనులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ సిర్పూర్(యు), ఏప్రిల్ 5 : సిర్పూర్(యు) మండలం చోర్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పూనగూడ వాసులు తాగు నీటి కోసం నరకయాతన పడుతున్నారు. గుక్కెడు నీటి కోసం రాళ్లురప్పలతో కూడిన అడవి దారి గుండా వెళ్లి.. గుట్ట కింద ఉన్న పాడుబడ్డ బావిలో నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 ఇండ్లు ఉన్న ఈ గ్రామంలో అంతా ఆదివాసులే. వీరి నీటి గోసను తీర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా పైపులైన్‌ను వేసింది. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు కాలేదు. గతంలో గ్రామం వరకు ఉన్న పైపులైన్ ద్వారా వచ్చిన నీటిని గ్రామస్తులంతా పట్టుకొనేవారు. పైపులైన్లు పగిలిపోవడంతో నాలుగు నెలలుగా నీరందడం లేదు. దీంతో దశాబ్దాల క్రితం గుట్ట కింద తవ్వుకున్న బావి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. గుట్ట దిగిన తర్వాత అరకిలోమీటర్ దూరంలో ఉన్న ఈ బావి వద్దకు ఇంటిల్లిపాది వెళ్లాల్సి వస్తున్నది. ఎడ్ల బండి ఉన్నవారు చిన్న ట్యాంకు ఏర్పాటు చేసుకొని నీళ్లు తెచ్చుకుంటారు. ఇక మిగతా వారందరికీ కాలినడకే. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన క్రమంలో మరోసారి నెత్తి మీద మోత తప్పడం లేదని ఆదివాసీలు వాపోతున్నారు.

### నాలుగు నెలల క్రితం వరకు నీళ్లచ్చేవి..



నాలుగు నెలల కిందటి వరకు మిషన్ భగీరథ పైపులైన్ ద్వా రా మా గ్రామానికి నీళ్లచ్చేవి. ఇంటింటి కీ నల్లాలు పెట్టలేదు. నీళ్లు మాత్రం మా గ్రామం వర కు వచ్చాయి. ఇప్పుడు నీళ్లు వస్తలేవు. దీంతో గుట్ట కింద పదేళ్ల క్రితం తవ్వుకున్న బావే మళ్లీ దిక్కైంది. ఇప్పుడది పాడు బడింది. అయినా ఆ నీరే తెచ్చుకుంటున్నం. అధికారులు మా తాగు నీటి సమస్యను అర్థం చేసుకొని పైపులైన్ ద్వారా నీళ్లందించాలి.

**-మడావి ఆనంద్ రావు, పూనగూడ**

### బిందెతో గుట్ట ఎక్కాలంటే నరకమే



బిందె నీళ్ల కోసం గుట్ట దిగాల్సి వస్తున్నది. పదేళ్ల కింద గుట్ట కింద తవ్వుకున్న బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నం. నీళ్ల బిందె నెత్తిమీద ఎత్తుకొని గుట్ట ఎక్కాలంటే నరకంలా ఉంది. తాగే నీటి కోసం మస్తు ఇబ్బంది అయితున్నది. ఇన్నాళ్లూ మాకు పైపులైన్‌తోనే నీళ్లచ్చేవి. ఇప్పుడు నాలుగు నెలల నుంచి ఏమైందో కానీ నీళ్లస్తలేవు. మా గోసను ప్రభుత్వం పట్టించుకోవాలె.

**-మడవి ఇంద్రాబాయి, పూనగూడ**